
సాయంత్రం దాదాపు ఆరు కావస్తూ వుంది నేను, పరీక్షలు దగ్గరకు రావటం ఎల్ల పుస్తకం పట్టుకుని దీక్షగా చదువుకుంటున్నాను ఇంతలో వాకిట్లోంచి "అమ్మా పాలు పితుకుతున్నాను, రండమ్మా" అని పాలతను కేకలు పెట్టాడు పనితో సతమత మవుతున్న అమ్మ, నన్ను కేక వేసి "వెళ్ళి పాలు పట్టుకురా అమ్మడూ, నేను పని తొందరలో వున్నాను" అన్నది పాలు పితికేటప్పుడు దగ్గర వుండక పోతే పాల వాళ్ళు నీళ్ళు కలుపుతారని ఆమె భయం. నేను విసుక్కుంటూ పుస్తకం టేబులుమీద పడవేసి వంటింట్లోకి వెళ్లి గిన్నె తీసుకుని బయటకు వెళ్ళాను.

నేను వెళ్ళేటప్పటికి నౌకరు పాలు పిండుతూ వున్నాడు. పాలతాత మెట్ల మీద కూర్చుని చూస్తూ వున్నాడు "నాకు చెంబు చూపించకుండానే పిండిస్తున్నావేం తాతా?" అని అడిగాను

"నువ్వు వచ్చేసరికి బత్తె చేపిందమ్మా అందుకని పిండిస్తున్నా" అన్నాడు పాలతాత.

"ఊఁ హూఁ, అయితే యెన్ని నీళ్ల కలిపారేంటీ" అన్నాను యెగతాళిగా.

నేను ఆ మాట అనగానే పాలతాత ముఖం వివర్ణం అయ్యింది. "బుల్లెమ్మా. బుల్లెమ్మా.



# పశ్చాత్తాపము

నన్ను ఆ మాట మాత్రం అనకమ్మా" అన్నాడు పాలతాత

అతని కంఠంలో ఆవేదన ధ్వనిస్తూ వున్నది నాకు పాలతాతమీద జాలి కలిగింది.

"నేను ఆ మాట అనగానే అలా అయిపోయావేం తాతా ? మీ పాల వాళ్ళందరూ కల్తీలేని పాలే పోస్తున్నారేమిటి ?" అని అడిగాను.

'నేను అలా అన్నానా తల్లీ బుద్ధి లేని యెదవలు నువ్వన్నట్లుగానే చేస్తారమ్మా. చేసే పాపాలకు ముందు ముందు అనుభవించబోయే ప్రతిఫలాన్ని గురించి యేమాత్రమన్నా తెలిస్తే యెవరూ మోసం చెయ్యరమ్మా. తెలిసి తెలిసి గోతిలో దిగే వాళ్ళెవరన్నా వుంటారా అమ్మా' అన్నాడు తాత

"ఓ హో ! అయితే నువ్వు ముందు ముందు అనుభవించబోయే ప్రతిఫలాన్ని గురించి తెలుసుకొని, పాలలో నీళ్ళు కలపటం మానివేశావన్నమాట?" అన్నాను హేళనగా

నేను ఆ మాట అనగానే పాలతాత కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి

''లేదు తల్లీ! జరగవలసిన దంతా జరిగిపోయింది ఇప్పుడు వున్న జ్ఞానం అప్పుడు వుండి వుంటే నా జీవితం ఈ నాడు ఇంత అధ్వాన్నంగా వుండేది కాదమ్మా చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్లు జరగవలసిం

ప్రమీలా దేవి

దంతా జరిగిపోయిన తరువాత యెంత బాధపడితే మాత్రం యేం ప్రయోజనం తల్లీ" అన్నాడు తడబడుతున్న మాటలతో

అతని బాధ చూచి నేను అతనిని హేళన చేసినందుకు చాలా బాధపడ్డాను అతనిని సముదాయించాలనే వుద్దేశంతో ''అయితే, యింతకు ముందు నీ జీవితంలో అనుకోని సంఘటన లేమైనా జరిగాయా ?" అని అడిగాను.

''అవునమ్మా ఆ సంఘటనలే నా గర్వాన్నీ, అహంభావాన్నీ, కాపట్యాన్నీ అణిచివేశాయమ్మా", అన్నాడు గద్గదికంగా

నాకు ఆ పాలతాత జీవితాన్ని గురించి తెలుసుకోవాలనే వుత్సాహం కలిగింది. "అయితే నీలో మార్పు తెచ్చిన సంఘటనలు యేమిటో నాకు చెప్పవా ?''అని అడిగాను

"ఆ రోజులు తలుచుకుంటే నా మీద నాకే అసహ్యం వేస్తుందమ్మా ఆ రోజుల్లో యెన్నో మోసాలు చేశాను మీలాంటి వాళ్ళు కాపలా వేసుకు కూర్చున్నా కూడా యెంతో తెలివిగానూ, నేర్పుగానూ, పాలలో నీళ్ళు కలిపే వాడినమ్మా అంతేకాదు, కొందరికి మంచి మాటలు చెప్పి పొడరు పాలుకూడ పోశే వాడిని. ఈ కల్తీపాల మీద వచ్చే డబ్బుతో వడ్డీ వ్యాపారము చేసేవాడిని వడ్డీల మీద వడ్డీలు వేసి యెన్నో కాపరాలను కూల్చాను ఆ రోజుల్లో నాలో రాక్షసత్వం తప్ప మానవత్వం యే కోశానా వుండేదికాదు అందరి ఇళ్ళూ కూల్చి, ఆ పాపపు సొమ్ముతో వొక యిల్లూ, రెండు యెకరాల పొలం కొన్నాను '' తాత కళ్ళనుంచి రెండు కన్నీటి బొట్లు రాలాయి పైపంచతో కళ్ళు తుడుచుకుని ఇలా అన్నాడు

"అంతేకాదు నా జీవనాధారా లయిన ఈ నోరులేని జీవాలను నానా హింసలు పెట్టేవాడిని వాటికి తిండి సరిగ్గా పెట్టకుండా వాటి నుంచి యెక్కువ లాభాలు పొందాలని తాపత్రయపడే వాడిని ఏనాడన్నా యే గేదన్నా పాలు ఇవ్వకుండా మొరాయించిందా, ఆ నాడు దాని తాటరేగి పోయే వరకూ చితకతన్నే వాడిని. నా దెబ్బల బాధకు తట్టుకోలేక ఆ మూగ జీవాలు ''నీకేం అన్యాయం చేశాం ? మమ్మల్నెందు కిలా బాధపెడతావు"అని మొర పెట్టుకున్నట్లుగా, అంబా అని ఆక్రోశించేవి కొట్టవద్దని బ్రతిమిలాడుతున్నట్లుగా నా వైపు దీనంగా చూసేవి అప్పుడు ఈ పొరలు కప్పిన కండ్లకివేవీ కనుపించేవి కాదమ్మా వీలైనంతవరకూ వాటిని బాధించి, వాటి రక్తం పిండి డబ్బు సంపాదించేవాడిని ఆ నాడు వాటి ప్రాణమూ, మన ప్రాణం లాంటిదేననీ, వాటికీ మనలాగే కష్టసుఖాలు వుంటాయనీ అనిపించేది కాదు

తల్లీ" అని నిట్టూర్చి కొంతసేపు ఆగి మళ్ళా చెప్పడం మొదలు పెట్టాడు

"ఆ రోజుల్లో నాకు, నీ వయసు కూతు రొకతీ, దానికన్నా రెండేళ్ళు చిన్నవాడైన కొడు కొకడు వుండే వారమ్మా భగవంతుడు వాళ్ళిద్దర్నీ రెండు రత్నాల్లాగా నాకు ప్రసాదించాడు కాని యేం లాభం? ఆ రెండు రత్నాలనీ నేను దక్కించుకోలేక పోయానమ్మా" ఈ మాట చెప్పి, దుఃఖపు తెరలు గొంతును అడ్డుకోవటం వల్ల ఒక్క క్షణం ఆగాడు గొంతు సవరించుకుని, దుఃఖం దిగమింగి మళ్ళా మొదలు పెట్టాడు

"నేను చేసే మోసాలను, అన్యాయాలను చూచి నా కూతురూ, కొడుకూ 'ఇలా నిన్ను నమ్మిన వారిని మోసం చెయ్యకు నాన్నా మన ప్రవర్తన మంచిదైతే భగవంతుడు మనని ఆదరిస్తాడు మనం ఇతర్లను మోసం చేస్తే భగవంతుడు మనని మోసం చేస్తాడు నువ్వు పోసే ఈ పాలు యెందరో పసిపిల్లలకు పడతారు వారు భగవత్స్వరూపులు ఆఖరికి మనం ఆ పసిపాపలను కూడా మోసం చేసిన పాపానికి గురిఅవుతాము నాన్నా నీ వడ్డీల వల్ల యెన్ని కాపరాలు కూలిపోతున్నాయో చూడు ఏ నాటి కైనా వారందరి వుసురూ మనకు కొట్టకపోదు నాన్నా' అని చిలకకి చెప్పినట్లు చెప్పేవారు.



"నాకు పది నిమిషాలు గడువివ్వండి చప్పున నాలుగు జేబులుకొట్టి, మీ పదిహేను రూపాయల జుల్మానా చెల్లిస్తాను."

కాని నా పాషాణ హృదయాన్ని ఆ మంచి మాటలు కరిగించలేక పొయ్యాయి నా దిబ్బిళ్ళు వేసిన చెవులలోకి ఆ తియ్యటి మాటలు అసలు దూరనేలేదు. కాని తరువాత దాని ఫలితం అనుభవించాను

'నా కూతుర్ని యెనిమిదో తరగతి వరకు చదివించి, నా మేనల్లుడికిచ్చి పెళ్లి చేశానమ్మా పెళ్ళయి రెండేళ్ళయినా తిరక్కముందె, వాడు పొలంలో పని చూచుకుని ఇంటికి వస్తూవుంటే పిడుగు పడి చచ్చిపోయాడు నేను దుఃఖించాను కాని ఆ సంఘటన నాలో కొంత బాధను మాత్రమే కలిగించింది నాలో సంపూర్ణమైన పరివర్తన కలిగించలేక పోయింది

ఆ తరువాత ఆరు నెలలు గడవక ముందే నా బిడ్డ తీర్థమాడలేక మమ్మల్ని వదలి వెళ్ళిపోయింది పోయేముందు నన్ను, తమ్ముణ్ణీ దగ్గరకు పిలచి, పసివాడిని తమ్ముడి చేతుల్లోపెట్టి 'తమ్ముడూ,

వీడిని నీలాగా, నీతి, నిజాయితీ గల మనిషిగా చెయ్యరా' అన్నది. తరువాత నాతో 'నాన్నా, యెవర్నీ మోసం చెయ్యకు నాన్నా' అని కన్నీరు జల జలా రాలుస్తూ ప్రార్థించింది అంతే, దానికీ నాకు ఆ నాటితో ఋణం తీరి పోయింది

నా బిడ్డ మరణం నాలో పెద్ద సంచలనాన్ని లేవదీసింది నా పిల్లలు చెప్పినట్లు నేను చేస్తున్నపని మంచిదికాదేమో అన్న సందేహం మొట్టమొదటి సారిగా నాకు కలిగింది నా అన్యాయమే నన్ను తిప్పికొడుతూ వున్నదేమో అనిపించింది నేను కొంతవరకు మారాను కాని మోసాలతోను, అన్యాయ తోను కరుడు కట్టిన నా మనసు ఆ పెడదారిలో నుంచి మంచి దారిలో పడలేదు

నా కూతురు పోయిన యేడాదే నా కొడుకు మిలిటరీలో చేరి ఢిల్లీ వెళ్ళి పోయాడు నేను నా మనవడిని పెంచుతూ, వ్యాపారం చూసుకుంటూ ఇక్కడే వుండిపోయాను మిలటరీలో చేరిన యేడెనిమిది నెలల తరువాత నా కొడుకు ఒక్కసారి పసివాడిని చూడటానికి వచ్చాడు వచ్చేటప్పుడు మేనల్లుడి కోసం రకరకాల ఆట వస్తువులు తెచ్చాడు వాడిని యెత్తుకుని ఫొటో తీయించుకుని "ఒరేయ్ బుజ్జి మల్లా నేను యెప్పుడు వస్తానో యేమో ! కాని ఈ ఫొటో మాత్రం జేబులో పెట్టుకుని అన్ని వేళలా నువ్వు నా పక్కనే వున్నట్లు సంబర పడతారా'' అని చెప్పాడు పసివాడితో వాడు మామ మాటలన్నీ అర్థమైనట్టే నవ్వాడు

ఆనాడు ఆ స్థితిలోవున్న వాళ్ళిద్దర్నీ చూడగానే నా మనస్సెందుకో కలుక్కు మన్నది. మరొక పది రోజుల తరువాత వాడు ఢిల్లీ వెళ్ళిపోయాడు

వెళ్ళేటప్పుడు "నాన్నా! ఇప్పటికైనా నా మాట విని ఈ అక్రమ వ్యాపారం మానేసెయ్యి డబ్బు కోసం ఇట్లా వక్ర మార్గాలలో నడవటం మంచిదికాదు నాన్నా నీకు కావలసిన డబ్బు నేను పంపిస్తాను, నువ్వు మాత్రం ఈ అన్యాయాలు, మోసాలు చెయ్యటం మానేసెయ్యి నాన్నా" అన్నాడు బ్రతిమాలుతూ

"ఆఁ...అన్నీ చేసేవాడివి బయలుదేరావులే నీ సంగతి నువ్వు చూసుకో." అని నేను చీదరించుకున్నాను కాని లోపల వాడు చెప్పేదాంట్లో సత్యం వున్నదనిపించింది పైకి మాత్రం అలవాటు చొప్పున వాడిని విదిలించుకున్నాను

"సరే, నీ యిష్టం అబ్బాయిని మాత్రం జాగ్రత్తగా చూస్తూవుండు నాన్నా'' అన్నాడు

నాకు వాడు చెప్పిన ఆఖరి మాటలు అవేనమ్మా వాడు వెళ్ళి మూడు నెల లైనా తిరక్కముందే యుద్ధంలో పోయాడని నాకు వార్త వచ్చింది నేను ఆ వార్త వినగానే కుప్పగా కూలిపోయాను నా జీవితం అంతా చీకటయిపోయిందమ్మా ఎక్కడ కూర్చున్నా,యెక్కడనుంచున్నా "మనం ఇతర్లని మోసం చేస్తే భగవంతుడు మనని మోసం చేస్తాడు" అన్న అమ్మాయి మాటలు, "నా మాట విని ఈ అక్రమ వ్యాపారం మానేసెయ్యి నాన్నా" అన్న అబ్బాయి మాటలు, నా చెవుల్లో గింగురుమని ప్రతిధ్వనిస్తూ వుండేవి ఆ మాటలు నన్ను పిచ్చి వాడిని చేశాయి నేను అందరినీ చేసిన మోసానికి ప్రతిమోసంగా భగవంతుడు నా బిడ్డల్ని నా నుండి వేరు చేశాడమ్మా వాళ్ళని అలా సాగనంపి నేను మోడు లాగా బ్రతుకుతున్నానమ్మా" అన్నాడు దుఃఖంతో వణికిపోతూ నేను నిశ్శబ్దంగా వింటూ నుంచున్నాను.

"అప్పటి నుంచి నేను యెవ్వర్నీ మోసం చెయ్యకూడదనీ, నా మంచి ప్రవర్తనతో నా బిడ్డల ఆత్మలకు శాంతి కలిగించాలనీ నిశ్చయించుకొని అలాగే కాలం వెళ్ళబోస్తున్నానమ్మా. అసలా రోజుల్లో నాకు చచ్చిపోదామనిపించిందమ్మా కాని నా మనమడు దిక్కులేని పక్షిలాగా అల్లాడిపోతాడని, ఈ మోడు బారిన జీవితాన్ని ఇట్లా కొనసాగిస్తున్నానమ్మా. ఇప్పుడు వాడూ, ఈ నోరు లేని జీవాలే నా ప్రపంచం తల్లీ నేను చేసిన పాపాలకు అనుభవించిన ప్రతిఫలం చాలమ్మా ఇక ఈ జన్మలో యెవర్నీ కూడా యెటువంటి పరిస్థితులలోను అన్యాయం గాని, మోసం గాని చెయ్యనమ్మా గడిచిన కాలం గడవగా మిగిలినదాన్ని మంచిగా గడుపుతానమ్మా." అన్నాడు తాత కళ్ళు తుడుచుకుంటూ.

"ఇంతలో జీతగాడు పిండిన పాలు తెచ్చి పాలతాత చేతికిచ్చాడు తాత పాలు కొలిచిపోస్తూ "నేను ఇంట్లో వుండి, జీతగాళ్ళని పాలు పొయ్యటానికి పంపవచ్చమ్మా కాని కక్కుర్తి యెదవలు యెక్కడ యే నీళ్ళు దొరికితే ఆ నీళ్ళు పాలలో కలిపి చస్తారమ్మా. అందుకే నేనూ వీళ్ళెంట పడివస్తాను వీళ్ళని కనిపెట్టి వుండకపోతే లాభం లేదమ్మా "

లోకంలో మనుష్యు లనుకునే వారందరికీ, ఈ తాతకు వున్న పశ్చాత్తాపం వుంటే యెంత బాగుండును కుట్రలకు మోసాలకు, అతీతంగా వుండి అంతా హాయిగా బ్రతకవచ్చు అనిపించింది నాకు. ★